క్లుప్తంగా

గౌడ మహాసభను విజయవంతం చేయండి

కెరమెరి: ఈనెల 5న కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే గౌడ మహాసభను విజయవంతం చేయాలని సంఘం మండలాధ్యక్షుడు సంజీవ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నివసిస్తున్న గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రవీంద్రనగర్‌లో ముగిసిన 'కంటి వెలుగు'

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్2లో గత 5రోజులుగా నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరం శుక్రవారంతో ముగిసింది. రవీంద్రనగర్2 కంటి వెలుగు వైద్య శిబిరంలో గత 5 రోజులలో 694 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, వీరిలో 104 మందికి కళ్లద్దాలు అందించామని, మరో 65 మందికి కళ్లద్దాలను త్వరలో పంపిణీ చేస్తామని శిబిరం వైద్యాధికారి అజ్మీర రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం నుంచి మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామంలో కంటి వెలుగు వైద్య శిబిరం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

'ఇంటింటికీ టీడీపీ' ప్రారంభం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆనంద్

కాగజ్‌నగర్‌రూరల్: ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని శుక్రవారం టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు గుళ్లపల్లి ఆనంద్ ప్రారంభించారు. పట్టణంలోని వార్డు నంబర్25, 26, 27లలో ప్రతీ ఇంటికి వెళ్తూ టీడీపీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ కౌన్సెలర్ గుల్లపల్లి లావణ్య, నాయకులు చల్లూరి శంకర్, సత్యనారాయణ, పుష్ప, ప్రభాకర్, శ్రీనివాస్‌రావు, సంజీవ్, నారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

మోకుదెబ్బ మండల అధ్యక్షుడిగా అశోక్ గౌడ్


అశోక్ గౌడ్

తిర్యాణి: మోకుదెబ్బ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు జువ్వాజి అనిల్‌గౌడ్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా జుంగోని అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పెరుమండ్ల లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యక్షులుగా గున్నాల సత్యగౌడ్, కోల చందుగౌడ్, కార్యదర్శులుగా రంగు లచ్చగౌడ్, గుర్రపు సత్యగౌడ్, కోశాధికారిగా తీగల నర్సగౌడ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మార్క శంకర్‌గౌడ్ ఉన్నారు.

నేడు కుస్తీ పోటీలు

కెరమెరి: మండలంలోని నెహ్రూనగర్‌లో కొనసాగుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామి జాతరలో శనివారం కుస్తీ పోటీలు జరుగనున్నాయి. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం : ఆర్గానిక్ మామ.. హైబ్రిడ్ అల్లుడు

కాగజ్‌నగర్

వెంకటరమణ : ఆర్గానిక్ మామ.. హైబ్రిడ్ అల్లుడు

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	40
బీరకాయ	60
కాకరకాయ	50
బెండకాయ	100
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజీ	40

-ఆసిఫాబాద్‌అర్బన్

నిర్మించినా.. ప్రారంభించలేదు!

- మండలంలో వైకుంఠధామాల నిర్మాణం పూర్తి
- మూడేళ్లయినా ప్రారంభానికి నోచని వైనం
- కరెంట్, నీటి సౌకర్యం కరువు
- పట్టించుకోని అధికారులు



మోతుగూడలో నిర్మాణం పూర్తయిన వైకుంఠధామం

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కోట్ల రూపాయలతో నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాలు నిర్మించి మూడేళ్లు గడుస్తున్నా నేటికీ ప్రారంభించలేదు.

జీపీకి ఒకటి చొప్పున..

మండలంలో 27 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీలో ఒకటి చొప్పున జీపీల్లో వైకుంఠధామాల నిర్మాణానికి 2019లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండలంలో పీఆర్ శాఖ నుంచి 22, రూర్బన్ నిధుల నుంచి నాలుగు వైకుంఠధామాలు నిర్మాణం పూర్తి చేశారు. పీఆర్ శాఖ నిర్మించే వైకుంఠధామానికి రూ.12.60 లక్షలు, ఈజీఎస్ ద్వారా నిర్మించే వైకుంఠధామానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేసి పనులు కూడ పూర్తి చేశారు. నిర్మాణాలు పూర్తి చేసి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు ప్రారంభించలేదు. దీంతో అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల నాణ్యత ప్రమాణాలు లేకుండా కట్టడంతో పగుళ్లు కూడా ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని అన్ని సౌకర్యాలతో వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు లేవు..

వైకుంఠధామాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా, నేటి వరకు నీరు, కరెంట్ వంటి సౌకర్యాలు కల్పించలేదు. గ్రామ పంచాయతీ నిధులతో కరెంట్, నీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులు తెలిపినా జీపీల్లో నిధులు లేక ముందుగా పెట్టుబడి పెట్టేందుకు సర్పంచ్‌లు ముందుకు రావడం లేదు. గత మూడు నెలల నుంచి రాష్ట్ర నిధులు, ఏడు నెలల నుంచి కేంద్రం నిధులు రాక ఇప్పటికే జీపీ కార్మికులకు వేతనాలతో పాటు సీసీ చార్జీలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉంది. వైకుంఠధామాలకు మిషన్ భగీరథ నుంచి నీటి సౌకర్యం కల్పించాల్సి ఉన్నా ఇప్పటివరకు పైప్‌లైన్ కూడా వేయలేదు. దీంతో కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి.

నీరు, కరెంట్ సౌకర్యం లేకనే..

మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాల నిర్మాణం పూర్తయ్యింది. కాని వాటికి కరెంట్, నీటి సౌకర్యం లేకపోవడంతో ఎక్కడా ప్రారంభం కాలేదు. నీటి సౌకర్యం కోసం భగీరథ పైప్‌లైన్ వేస్తామని సంబంధిత అధికారులు చెప్పారు. కాని ఇంతవరకు వేయలేదు. ప్రారంభానికి తగిన చర్యలు తీసుకుంటాం.

- ప్రసాద్, ఎంపీవో

గ్యాస్ ధర పెంపుపై బీఆర్‌ఎస్ నిరసన


దహెగాం: నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దహెగాం: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. పెంచిన గ్యాస్ ధరను నిరసిస్తూ శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్‌రాజు, సర్పంచులు క్రిష్ణమూర్తి, శంకర్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే హైమద్, నాయకులు భీమన్న, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: కేంద్రం దశలవారీగా వంట గ్యాస్ ధరలు పెంచుతూ సామాన్య ప్రజల నడ్డీ విరుస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం అన్నారు. పెరిగిన వంటగ్యాస్ ధరలను నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ధర్నా నిర్వహించారు. మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగ ఓంప్రకాష్, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: గ్యాస్ సిలిండర్ ధర పెంచడాన్ని నిరసిస్తూ కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ గ్యాస్ ధరలను పెంచడం వల్ల సామాన్యులపై ఎంతగానో భారం పడుతుందన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచకొండ గిరీష్‌కుమార్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మోదీ సర్కార్ పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెరిగిన గ్యాస్ ధరలను నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలిపారు. పీఏసీఎస్ చైర్మెన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్‌చైర్మన్ మహేష్‌గౌడ్, సర్పంచ్ అహల్యాదేవి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ మధునయ్య, నాయకులు శంకరమ్మ, అన్నపూర్ణ అరుణ, శ్రీధర్, అజయ్‌జైస్వాల్, రాజేష్, భరద్వాజ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.


బెజ్జూర్: నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కాగజ్‌నగర్‌రూరల్: రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


రెబ్బెన: రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత

చింతలమానెపల్లి: శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో శుక్రవారం పోలీసులు మీకోసంలో భాగంగా కళాజాత ప్రదర్శన నిర్వహించారు. మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, డ్రంకెన్ డ్రైవ్, తదితర అంశాలపై కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎస్సై విజయ్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.


నూతన సీఐకి సన్మానం

కౌటాల: కౌటాల సీఐగా బాధ్యతలు స్వీకరించిన సీఐ సాధిక్ పాషాను శుక్రవారం మండలంలోని పలు సంఘాల నాయకులు శాలువాతో సన్మానించారు. సీఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పోలీస్‌శాఖకు సహకరించాలన్నారు. మన్నెవార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్య, బౌద్ధ సంఘం కమిటీ మండల అధ్యక్షుడు బండురావ్, మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, మండల అధ్యక్షుడు గంగారం, పోశం, సదాశివ్, ఆగయ్య, రమేష్, జ్యోతిరావ్, నాందేవ్, సాయినాథ్, గోవింద్ రావ్, దేవాజీ, నాగయ్య, భీమయ్య పాల్గొన్నారు.


సీఐ పాషాను సన్మానిస్తున్న నాయకులు

ప్రకృతి పార్క్‌లో పాఠశాల విద్యార్థులు





సిర్పూర్(టి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు ఎంపిక చేసిన 50మంది విద్యార్థులు శుక్రవారం వేంపల్లి ప్రకృతి పార్క్‌ను సందర్శించారు. విద్యార్థులు బేస్ క్యాంపులో అటవీ మొక్కలు, పక్షులు, వన్యప్రాణులను పరిశీలించారు. అనంతరం బైరమ్మ గుట్ట వరకు ట్రెక్కింగ్ చేశారు. రాత్రి ఫైర్ క్యాంప్ నిర్వహించారు.

రేపు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడలో గల సాయిబాబా దేవాలయ వార్షికోత్సవాన్ని ఈనెల 5న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మీసేవ కేంద్రం పరిశీలన

వాంకిడి: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని తహసీల్దార్ రహీమొద్దీన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ శ్రవణ్ కుమార్ ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతు పనులు చేపడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఎం.రవీందర్ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పీటీఆర్ వర్క్, వీసీబీ, ఎల్‌వీ బ్రేకర్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అలరించిన భాగవత కథనం


ప్రవచనాలు బోధిస్తున్న మహరాజ్

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్2లో నిర్వహిస్తున్న భాగవత కథనం భక్తులను అలరిస్తోంది. గత రెండు రోజుల నుంచి గ్రామస్తులు స్థానిక మైదానంలో భాగవత కథనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని ప్రసిద్ధ శైవక్షేత్రం ఉజ్జయినికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రామ్ సఖాజు మహరాజ్ భాగవత కథా ప్రవచనాలను బోధించారు. శ్రీకృష్ణ, హరికథ బోధనలు, ప్రవచనాలు వినిపించారు. ప్రవచనాలకు గ్రామంలోని భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు, సర్పంచ్ సుశీల్, తదితరులు హాజరై మహరాజ్ ఆశీస్సులు తీసుకున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కల్వర్టు లేక కష్టాలు..!



దహెగాం: మండల కేంద్రం నుంచి కల్వాడ వైపు వెళ్లే దారిలో పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపై నీరు నిలుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లో నుంచి నీరు వచ్చి రోడ్డుపై చేరుతుండడంతో కష్టాలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : లక్ష్మీనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ

సెల్ నంబర్ : 9440818432

'దుండగులపై చర్యలు తీసుకోవాలి'

బెజ్జూర్: పురాతన గిరిజన దేవాలయాలను ధ్వంసం చేస్తున్న దుండగులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని అందుగులగూడ, ఊట్పల్లి గ్రామ శివారులోని శివమల్లన్న గుట్టపై గల పురాతన శివాలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీ సందర్శించి సమగ్ర విచారణకు ఆదేశించాలని, లేకుంటే ఆదివాసీ, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, ఎంపీటీసీ శంకరమ్మ పాపయ్య, సర్పంచ్ విజయ్, తిరుపతి గౌడ్, దిలీప్, మహేందర్, సామెర మహేందర్, శ్రీనివాస్, జలపతి, చంద్రయ్య, శంకర్, సంతోష్, సురేష్, రాజేశ్వర్, దుర్గయ్య, తొర్రెం శ్రీనివాస్, వెంకటేష్, ఓంప్రకాష్, బాలాజీ, దుర్వ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాల్వాయి హరీష్‌బాబు

ప్రభుత్వం విఫలం

కాగజ్‌నగర్‌రూరల్: మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ప్రీతి మృతికి నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, చేరాల శ్రీనివాస్, కార్తీక్, రమేష్, సంతోష్, తిరుపతి, అర్జున్, రాజేందర్, అనిల్‌కుమార్, కె.తిరుపతి, శ్రావణ్, రాజు, నరేష్, రమేశ్ పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారించాలని వినతి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని 22వ వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వెంటనే నివారించాలని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వార్డు కౌన్సెలర్ అన్నబోయిన లావణ్య శరత్ వినతిపత్రం అందజేశారు. వార్డులో మార్కెట్ ఏరియా ఉండటంతో జనాల తాకిడి ఎక్కువగా ఉంటుందని, కుక్కల వల్ల తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న లావణ్య శరత్

యువత సరైన మార్గంలో నడవాలి

వాంకిడి: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సరైన మార్గంలో నడవాలని ఎస్సై డి.సాగర్ అన్నారు. పోలీసులు మీకోసంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఆదివాసీ గ్రామాలు సర్కేపల్లి, కొలాంగూడలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ఆదివాసీ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో మానసికోల్లాసంతో పాటు చెడు వ్యసనాల బారిన పడకుండా ఉంటారన్నారు. గ్రామాల్లో అపరిచితులు ఎవరైనా కన్పిస్తే వెంటనే 100కు సమాచారం అందించాలన్నారు. అనంతరం గ్రామంలోని యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో ఆత్రం లచ్చు, జగన్నాథ్‌రావు పాల్గొన్నారు.


వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై సాగర్

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కౌటాల: విద్యార్థుల సామర్థ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల నోడల్ అధికారి జి.హన్మంతు అన్నారు. శుక్రవారం మండలంలోని వైగాం, న్యూకాలని, సాండ్‌గాం, గుడ్లబోరి గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థులు రాయడం, చదవడం తప్పనిసరిగా వచ్చేలా చూడాలన్నారు. ఆయన వెంట సీఆర్‌పీ దేవన్న ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో జీవస్వరం కూటములు

కౌటాల: మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో శుక్రవారం జీవస్వరం సువార్త స్వస్థత కూటములను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జ్యోతి ప్రజల్వన చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిషప్ ప్రిన్స్ అంతోని జీవస్వరం కూటములను ప్రారంభించారు. ఆయన క్రైస్తవులకు దేవుని వాక్యం బోధించారు. కూటముల్లో ఫాదర్లు సీజో, బైజూ, సతీష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

6న కామదహనం

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 6న కామదహనం, 7న హోలీ పండుగ నిర్వహించుకోవాలని భార్గవ అర్చక సంఘం ఆధ్వర్యంలో నిర్ణయించినట్లు జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ, కేశవనాథస్వామి దేవస్థానం అర్చకుడు నరేష్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న సాయంత్రం 5 గంటలకు బ్రాహ్మణవాడ కేశవనాథస్వామి ఆలయంలో స్వామివారికి డోలోత్సవం, భజనా కార్యక్రమం అనంతరం రాత్రి 7 గంటలకు కామ దహనం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు అందజేత

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, పోతేపల్లి, గొంట్లెపేట్, ఎల్కపల్లి, ఆగర్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు పాలేపు మురళీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్లాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచకొండ గిరీష్, గణపురం ప్రకాష్, కమల్ కిషోర్ భంగ్, తుడురు విజయ్‌కుమార్, గడ్డం శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వీడ్కోలు సమావేశం

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీలో శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎస్‌వో రమాదేవి మాట్లాడుతూ వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు.